క్రిష్టియానిటీ చెబుతుంది- ఏసుక్రీస్తు వజ్రాలు సృష్టించేది తనలా త్యాగం చేసి, ఇతరుల కోసం పాటుబడే తన భక్తుల కోసం కాని సైతానుల కోసం కాదని

శ్రీనాథ్ నీ లక్ష్యాన్ని నీవు నిర్ణయించుకున్నావు. దాన్ని సాధించే వరకు నిద్రించకు.

ఇంట్రెస్ట్ వున్న ప్రతివాడు టెన్నిస్ ఆడతాడు. ఎలాగోలా ఆడగలడు. కాని ఛాంపియన్ ఆడే ఆట వేరు. ఎందుకంటే అతను ఆ ఆటనే తింటాడు- ఆ ఆటలోనే ఆదమరచి నిద్రపోతాడు. ఆ ఆటనే పలవరిస్తాడు.

నటన మీద మోజున్న ప్రతివాడు నటిస్తాడు- నటించానని కొందరితోనైనా అనిపించుకోగలడు. కాని మహానటుడు అయా పాత్రలలో జీవిస్తాడు. ఆ పాత్ర కోసమే పుట్టాడా అని కొందరితో కాదు అందరితో అనిపించుకుంటాడు. ఎలాగో తెలుసా? ఆ పాత్రను అర్థం చేసుకొని, ఆ పాత్ర పట్ల మక్కువ పెంచుకొని- ఆ పాత్రను సజీవం చేయడానికి అన్ని విధాల కృషిచేసి-

**HE EATS**
**HE DREAMS**
**AND HE SLEEPS WITH THIS OBJECTIVE**

ఎప్పుడైతే కూలిపోతావో అప్పుడు నీ అంతట నీవే లేవడం నేర్చుకో. ఎప్పుడైతే తప్పుదారిన పోతావో అప్పటి నుంచి ఆ తప్పుల్ని తెల్సుకోవడం నేర్చుకో, ఎక్కడా, ఎప్పుడూ మొండిగా, మూర్ఖంగా వ్యవహరించకు. మార్పును ఆహ్వానించి, అది మంచిదైతే నీ జీవితంలో దాన్ని అమలుపర్చుకోగలిగేంత సులువుగా వుండు.

ఎప్పుడైతే నీ ముందు దారి మూసుకుపోతుందో వెంటనే ఆ దారి మార్చు. కొత్త దారికి అనుగుణంగా మారిపో.

ఎక్కడైతే నీవు ఆగిపోతావో అప్పుడు- అమెరికా దేశానికి వచ్చిన తొలి వలసవారి మాటలు గుర్తుంచుకో-

**We have no way to go but up''**

''మాకు ముందుకు వెళ్ళేందుకు మరో దారి లేదు. పైకి వెళ్ళడం తప్ప. వారి మాటలని ఎందుకన్నానంటే వాళ్ళే అమెరికాను భాగ్యవంతం చేసింది కనుక. ఇక్కడ పైకి వెళ్ళడం అంటే ఉన్నత స్థాయికి అని అర్థం చేసుకో...''




ఆ రోజుకు మాలినిదేవి తన ప్రసంగాన్ని ముగించి లేచింది.

ఆమె ముందూ, అతను వెనుకా... ఆలయ ప్రాంగణం దాటుతున్నారు నెమ్మదిగా,

అప్పుడందామె-

''ఇప్పుడు నువ్వు రక్షించింది న్యూట్రాన్-ప్రోటాన్‌ల మిశ్రమాన్ని. అది మహాబల సంపన్నమైన ముడిపదార్థం. దానికి పదును పెట్టు- మరెంతో బలవంతమైన న్యూక్లియస్ ఉద్భవిస్తుంది. సముద్రపు ఉప్పునీరు ఉప్పెనయితే దారుణాలు జరుగుతాయి- అదే ఆవిరై- మేఘమై- వర్షిస్తే నవరత్నాలు పండుతాయి. ప్రస్తుతం హాస్పటల్‌లో వున్న ఆ కఠినమైన ఉప్పు నీటిని కరిగించి మలినాల్ని వడకట్టు...'' అంటూ జీప్ ఎక్కి కూర్చుంది.

** ** **

పత్రికలో ప్రకటన ఇచ్చి అప్పటికి నాల్గవరోజు. మొత్తం కలిపి అప్పటికి వచ్చిన అప్లికేషన్స్ మూడే.

ఈ విషయం కనుక్కొనేందుకు పత్రికాఫీసుకి వెళ్ళిన హిందూకి తెలిసిన అతి నిరుత్సాహకరమైన వార్త అది. ఆ విషయం శ్రీనాథ్‌కి చేరవేసేందుకు ఆమె బయలుదేరింది.

(సశేషం)

## కాలందాటని కథ

# పార్టీ

ఎండ మండిపోతోంది. తలవంచుకుని నడుస్తున్న సుబ్బారావు మెదడులో ఎన్నో... ఎన్నెన్నో ఆలోచనలు సుళ్ళు తిరుగుతూ బాధపెడుతున్నాయి. ''అబ్బ... పగవాడిక్కూడ వద్దురా భగవంతుడా ఇంతటి విషమ పరీక్ష'' మనసులో గొణుక్కున్నాడు సుబ్బారావు. ఇంతకీ అతని బాధకి కారణం ఏమిటంటారా... అతనికి ప్రమోషన్ రావడమే... అలా నోళ్ళు తెరవకండి... ప్రమోషన్ వచ్చిందని తెలియగానే అందరిలాగే ఎగిరి గంతేసిన సుబ్బారావు ఆఫీస్ స్టాఫ్ అంతా పార్టీ అడగ్గానే, పాపం చప్పబడిపోయాడు. ''ప్రమోషన్ వచ్చిందన్న మాటేగాని జీతంలో ఓ 50 రూపాయిలే పెరిగాయి. కాని వీళ్ళందరికి పార్టీ ఇస్తే... అమ్మో...'' చిగురుటాకులా వణికిపోయాడు సుబ్బారావు.

ఎలా తప్పించుకోవాలి... ఎలా తప్పించుకోవాలి...! తీవ్రంగా ఆలోచిస్తూ నడుస్తున్నవాడల్లా టక్కున ఆగిపోయాడు. కారణం రోడ్డు మీద 100 రూపాయిల కాగితం పడుంది. చుట్టూ చూశాడు. ఎవ్వరూ లేరు.



చటుక్కున వంగి దాన్నందుకుని జేబులో పెట్టేశాడు. కాళ్ళు వణుకుతున్నాయి. తడబడే అడుగులతో ఆఫీస్ చేరుకున్నాడు. ''హమ్మయ్య సమస్యకి పరిష్కారం చూపెట్టాడు ఆ దేవుడు. ఎంత అదృష్టవంతుడు తను'' అని మురిసిపోతూ ఆఫీస్ స్టాఫ్ అందరికీ ఆ వందతో పార్టీ ఇవ్వడానికి నిశ్చయించాడు. స్టాఫ్ అంతా ఒక్కసారి నోరు తెరిచింది. పిసినారి సుబ్బారావు పార్టీ ఇస్తున్నాడంటే...

తేలికపడ్డ మనసుతో ఇంటికి వచ్చిన సుబ్బారావు ఇంట్లో దిగాలుగా కూచున్న భార్యని చూడగానే... ''ఏమయింది'' అంటూ కంగారుగా దగ్గరికి వచ్చాడు. సుబ్బారావుని చూడగానే ఆవిడ దుఃఖం మరింతగా పెరిగింది. వెక్కి వెక్కి ఏడుస్తూ నెమ్మదిగా చెప్పింది. ''మరేనండి... నేను నేను ప్రొద్దున సరుకులు తెద్దామని బజారు వెళ్ళానండి, అక్కడ... అక్కడ వీరకొంగుకి కట్టుకున్న మూడు వందలు... ఎక్కడో పోయాయండి...''

అంతే దభేల్‌మని పడిపోయాడు సుబ్బారావు.

— కె. శ్రీరామ్

# విజ్ఞప్తి

**మా కార్యాలయంలో ప్రచురణకు స్వీకరించిన కథలు, కవితలు, నవలలు హెచ్చు సంఖ్యలో మిగిలి వున్నందున, తిరిగి మేము ప్రకటించే వరకు కథలు, కవితలు, నవలలు ప్రచురణకు పంపరాదని రచయితలు/రచయిత్రులు గమనించి మాతో సహకరింప కోరుతున్నాము.**

**-ఎడిటర్**